- బీఆర్ఎస్‌కు ఆర్ఎంపీల మద్దతు

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని గ్రామీణ వైద్య సేవకుల (ఆర్ఎంపీ) సంఘం బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం కొడంగల్‌లో గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి సంఘం తరపున చేసిన ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేసింది. నియోజకవర్గంలోని ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను గుర్తించి కొడంగల్‌లోని గాంధీనగర్ 4వ వార్డులో భవనం మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని తీర్మానం చేసినట్టు సంఘం నాయకులు తెలిపారు. -కొడంగల్

చంపేస్తామని ఈటల అనుచరులు బెదిరిస్తున్నరు

- కేసులైనయ్, ఉద్యోగం పోయింది
- రెండేండ్లు కోర్టుల చుట్టూ ప్రదక్షిణ
- అయినా ఈటల పట్టించుకోలేదు
- ప్రసంగం అడ్డుకున్నానని నాపై దాడి
- ఈటల అనుచరులతో ప్రాణహాని
- బాధితుడు సాయిప్రసన్న ఆవేదన

కమలాపూర్, నవంబర్ 20: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోసం హుజూరాబాద్ ఉపఎన్నికల్లో పనిచేస్తే కేసులు అయ్యాయని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఊడిందని ఓ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. రెండేండ్లుగా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఈటల పట్టించుకోవటం లేదని నిట్టూర్చాడు. ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నా కనీసం కనికరించటం లేదని తెలిపాడు. ఎన్నికల ప్రచారం కోసం తన గ్రామంలో ఈటల ప్రసంగిస్తుండగా అడ్డుకోవటంతో ఆయన అనుచరులు తనపై దాడికి పాల్పడ్డారని చందబోయిన సాయిప్రసన్న అనే యువకుడు వెల్లడించాడు. బాధితుడి కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మర్రిపెల్లిగూడేనికి చెందిన చందబోయిన సాయిప్రసన్న రెండేండ్ల క్రితం ఏబీవీపీ కరీంనగర్‌లో స్టూడెంట్ ఆర్గనైజేషన్‌లో పనిచేశాడు. హుజూరాబాద్ ఉపఎన్నికలు రావడంతో కరీంనగర్‌లో ఉన్న సాయిప్రసన్నకు ఈటల ఫోన్ చేసి ఎన్నికల్లో పనిచేయాలని కోరారు. దాంతో ఈటల గెలుపు కోసం అతడితో పాటు పది మంది స్నేహితులు పని చేశారు. ఎన్నికల సమయంలో తెల్లవారితే ఓటింగ్ ఉండటంతో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తుల పేర్లు రాసుకుని పంపించారు. రెండు రోజులకు కేసులు నమోదైనట్టు నోటీసులు జారీ చేశారు. ఎన్నికలు ముగిశాక ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాడు. అయితే, క్రిమినల్ కేసులు నమోదు కావటంతో ఆ కంపెనీ ఉద్యోగంలోంచి తొలగించింది. ఉద్యోగం కోసం, కేసులపై రెండేండ్లుగా శామీర్‌పేటలోని ఈటల ఇంటి చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవటం లేదని సాయిప్రసన్న ఆవేదన వ్యక్తం చేశాడు. ఉద్యోగం కోల్పోయి రోడ్డునపడ్డానని, తనను ఆదుకోవాలని ఈటలను అడిగితే.. ఎవరికోసం పనిచేసినవ్ అని అన్నారని కన్నీటి పర్యంతమయ్యాడు.

గుంపులు గుంపులుగా వెంబడిస్తున్నారు

'అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 19న మర్రిపెల్లిగూడేనికి వచ్చిన ఈటల ప్రచార రథంపైకి ఎక్కాను. ఉద్యమ సమయంలో కేసులు నమోదైనా భయపడకుండా ప్రజల కోసం పనిచేశానని ఈటల అన్నారు. దీంతో ఉద్యోగం కోల్పోయిన నాకు ఇప్పించలేదని అడిగా. కేసులు నమోదైనా పట్టించుకోవటం లేదని నిలదీశా. వెంటనే ఈటల అనుచరులు ప్రచార రథం నుంచి కిందకు లాగి చంపేస్తామంటూ పిడిగుద్దులు గుద్దారు. ఆ మరుసటి రోజు నుంచి నేను ఎటువెళ్తే అటు గుంపులు గుంపులుగా వెంబడిస్తున్నారు. ఈటల అనుచరులతో నాకు ప్రాణభయం ఉంది' అని ఆరోపించాడు.

కాంగ్రెస్‌లో సీఎం కుర్చీ లొల్లి

- ఊహల్లో తేలిపోతున్న రేవంత్‌రెడ్డి
- తాను వస్తుంటే సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేయించాలని అభ్యర్థులకు హుకుం!
- టీపీసీసీ చీఫ్ రేవంత్ తీరుపై అభిప్రాయానికి ఫిర్యాదులు
- ఒంటరిగా వచ్చి నేనే బుడంకాయ్ అంటే ఎవడు పట్టించుకుంటాడు: రేణుకాచౌదరి ఎద్దేవా
- 20 మందికి మేమే ఫండింగ్ చేస్తున్నాం: కోమటిరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): 'ఆలులేదు.. చూలులేదు కొడుకుపేరు సోమలింగం' అన్నట్టు తయారైంది కాంగ్రెస్‌లో సీఎం కుర్చీ పంచాయితీ. ఇక ప్రమాణ స్వీకారమే తరువాయి అన్నట్టుగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఊహల్లో తేలిపోతున్నారు. ఆయన వ్యవహార శైలిపై పార్టీలోని ఇతర నేతలు సెటైర్లు వేస్తున్నారు. 'మేం 30 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుంటున్నాం. వాళ్లల్లో 20 మందికి మేమే ఫండింగ్ చేసుకుంటున్నాం. 'సీఎం..సీఎం' అని నేనూ అనిపించుకోగలను. కానీ, అలాంటి చిల్లర పనులు చేయను' అని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరోక్షంగా రేవంత్‌రెడ్డికి చురకలు అంటించారు. 'ప్రతి ఎమ్మెల్యే తాను సీఎం కావాలనుకుంటాడు. నువ్వు ఒంటరిగా వచ్చి నేనే బుడంకాయ్ అంటే ఎవడు పట్టించుకుంటాడు? ఎవడూ పట్టించుకోడు. తప్పనిసరిగా ఎమ్మెల్యేల మద్దతు ఉండాల్సిందే' అని మాజీ మంత్రి రేణుకాచౌదరి వ్యాఖ్యానించడం కాంగ్రెస్ పార్టీలో మరింత కాక రేపుతున్నది.

రేవంత్‌రెడ్డిపై ఒరిజినల్ కాంగ్రెస్ రగల్ జెండా

ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి తన వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకోవడం కోసం తాపత్రయపడుతున్నారని ఆ పార్టీలోని సీనియర్ నేతలే కాకుండా అభ్యర్థులు కూడా ఆరోపిస్తున్నారు. తాను వేదిక మీదికి వస్తుండగానే 'సీఎం సీఎం..' అంటూ నినాదాలు చేసే బ్యాచ్ ఒకటి మస్ట్‌గా ఉండాలని రేవంత్‌రెడ్డి అభ్యర్థులకు హుకూం జారీ చేస్తున్నారనే ప్రచారం సాగుతున్నది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులు తాము జమచేసిన వారితో ఆయన జై కొట్టించుకోవటం ఏమిటి? అని వాపోతున్నారట. రేవంత్‌రెడ్డి ప్రచార ఆర్భాటం, ఇటీవల మీడియా వేదికల మీద తన హావభావ విన్యాసంపై పలువురు నేతలు పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లినట్టు ప్రచారం సాగుతున్నది. రేవంత్‌ను కట్టడి చేయకపోతే తమకు వచ్చే ఓట్లు కూడా రాకుండాపోతాయని పలువురు నేతలు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యంఠాకూర్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. రేవంత్ ఎంత ఎగిరితే తమకు అంతమంచిదని మరో నేత తన సన్నిహితులతో చెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రజలను ఓట్లు అభ్యర్థించడానికి బదులుగా తనను సీఎం చేయాలని, తనకు మాత్రమే సీఎం అయ్యే అర్హతలు ఉన్నాయని చెప్పుకునే వేదికలుగా ఎన్నికల ప్రచారం మారిపోవడం తమ అధ్వాన్నస్థితికి దర్పణమని పేరు చెప్పడానికి ఇష్టపడని కాంగ్రెస్ అభ్యర్థి ఒకరు వ్యాఖ్యానించారు.

2014కు ముందు, ప్రస్తుతం తెలంగాణ ఎలా మారిందో తెలిపేలా వెబ్‌సైట్‌లో పొందుపర్చిన ఒక దృశ్యం

ఎట్లుండె తెలంగాణ.. ఎట్లైంది

- తెలంగాణ అభివృద్ధిపై ప్రత్యేక వెబ్‌సైట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 20(నమస్తే తెలంగాణ): తొమ్మిదిన్నరేండ్ల క్రితం వరకూ రాష్ట్రం ఎలా ఉన్నది.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తెలంగాణ ఎలా పరివర్తన చెందింది.. కండ్లకు కట్టినట్టు చూపించే ఓ ప్రత్యేక వెబ్‌సైట్ ఆవిష్కృతమైంది. తమ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ రూపాన్ని ఇస్తూ ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. 'ఎట్లుండే తెలంగాణ– ఎట్లైంది తెలంగాణ (http://etlundetelangana etlaindi telangana.com)' ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాక ముందు, 2014 నుంచి ఇప్పటి వరకు యావత్ తెలంగాణలో చోటు చేసుకున్న మార్పులు, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఈ వెబ్‌సైట్‌లో వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ జిల్లాలు, భౌగోళిక స్వ రూపం, ప్రత్యేక రాష్ట్రంలో జరిగిన అభివృద్ధితో ఈ తొమ్మిదిన్నరేండ్లలో మారిన భౌగోళిక స్వరూపాన్ని ఫొటోలు, సమాచారంతో కండ్లకు కట్టినట్టు ప్రచురించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సోషల్ మీడియా వేదికైన ఎక్స్ ద్వారా ఈ వెబ్‌సైట్ గురించి నెటిజన్లతో పంచుకున్నారు. ప్రతిపక్షాలు చేసే తప్పుడు ఆరోపణలు, అసత్యపు ప్రచారాలకు చెక్ పెట్టేలా రూపొందిన ఈ డిజిటల్ వేదికకు జనాల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది.

అమిత్ షా.. ఫ్లాప్ షో

జనగామ, మెట్‌పల్లిలో బీజేపీ సభలు ఫెయిల్

- పసలేని కేంద్రహోం మంత్రి ప్రసంగం
- జనాలకు చేరని అనువాదం సంభాషణ
- స్పీచ్ మొదలవగానే బయటకెళ్లిన జనం
- వారిని ఆపడానికి శ్రేణుల ఆగడాలు
- ఫొటో తీస్తున్న 'నమస్తే తెలంగాణ' విలేకరికి బెదిరింపులు

జనగామ చౌరస్తా/మెట్‌పల్లి నవంబర్ 20: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొన్న జనగామ, మెట్‌పల్లి బహిరంగ సభలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ స్కూల్ గ్రౌండ్‌లో, జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని అంబేద్కర్ మినీ స్టేడియంలో సోమవారం బీజేపీ శ్రేణులు బహిరంగ సభలు ఏర్పాటుచేశాయి. జనం లేక సభలు వెలవెల బోయాయి. పసలేని తన ప్రసంగంతో అమిత్ షా జనాల్ని ఆకట్టుకోలేక పోయారు. జనగామలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అమిత్ షా స్పీచ్‌ను తెలుగులోకి అనువదించినా ప్రజలకు అది చేరలేదు. చప్పగా సాగుతున్న అమిత్ షా ప్రసంగంతో సభా ప్రాంగణం నుంచి జనం లేచి బయటకు వెళ్లే ప్రయత్నం చేశారు. ప్రజలను బయటకు వెళ్లనీయకుండా కొందరు బీజేపీ నాయకులు మీకు డబ్బులివ్వబోమని బెదిరిస్తూ దౌర్జన్యంగా అడ్డుకున్నారు. వెళ్లేదారికి అడ్డంగా నిలబడి తమ చేతులతో లోపలికి నెట్టే ప్రయత్నం చేశారు. ఈ ఘటనను ఫొటో తీస్తున్న 'నమస్తే తెలంగాణ' విలేకరిపై సదరు కాషాయ గూండాలు బెదిరింపులకు దిగారు. స్థానిక బీజేపీ నాయకుడితో పక్కనే ఉన్న మరో నాయకుడు దాడికి దిగే ప్రయత్నం చేశారు. తన ప్రసంగానికి ప్రజల నుంచి స్పందన రాకపోవడంతో అమిత్ షా కేవలం 18 నిమిషాల్లోనే ప్రసంగం ముగించి వెళ్లిపోయారు. ఒక్కొక్కరికి రూ.300 చెల్లించి జనగామ బీజేపీ సభకు అద్దె కూలీలను తరలించారు. మీటింగ్‌కు వచ్చిన కూలీలను లెక్కపెట్టి బహిరంగంగానే పేర్లు రాసుకుంటూ డబ్బులిస్తూ బీజేపీ నాయకులు కనిపించారు.

కొల్లాపూర్‌లో బీజేపీ సభ వెలవెల

కొల్లాపూర్, నవంబర్ 20: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ హాజరైన బీజేపీ సభ వెలవెలబోయింది. సభలో సగానికిపైగా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. సభకు పెద్దఎత్తున జనాన్ని తీసుకురావడానికి బీజేపీ నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మధ్యాహ్నం 3 గంటలకు సభావేదిక మీదకు నితిన్‌గడ్కరీ వచ్చి ప్రసంగించారు. గడ్కరీ హిందీలో చేసిన ప్రసంగాన్ని మరోనేత తెలుగులో అనువాదం చేసినా అర్థంకాకపోవడంతో చాలా మంది మధ్యలోనే లేచి వెళ్లిపోయారు.

గానుగుపహాడ్‌లో ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సీఎం కేసీఆరే తెలంగాణకు బాద్‌షా

రేవంత్, కొమ్మూరిపై ప్రజలకు నమ్మకం లేదు • ఎన్నికల ప్రచారంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్, నవంబర్20: గుజరాత్ నుంచి అమిత్‌షా, డిల్లీ నుంచి రాహుల్ గాంధీ, అమేథీ నుంచి ప్రియంక గాంధీ ఇలా ఎవరు వచ్చినా.. తెలంగాణకు సీఎం కేసీఆర్ బాద్‌షా అని జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గానుగుపహాడ్ కల్యాన్‌నగర్, యశ్వంతాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వార్డుల్లో ప్రచారం చేస్తుంటే కార్యకర్తలు పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి.. ఊసరవెల్లి రంగులు మార్చినట్టు పార్టీలు మార్చారని విమర్శించారు. ఎర్రకుంట తండాలో పల్లా, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య లంబాడీలతో కలిసి నృత్యాలు చేశారు.

- నర్సాపూర్‌లో రేవంత్ సభ గందరగోళం

మెదక్ జిల్లా నర్సాపూర్ మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించిన విజయభేరి సభ గందరగోళంగా మారింది. కాంగ్రెస్ నేతలు మాట్లాతుండగా ఓపిక నశించిన యువకులు ఆవేశంతో కుర్చీలు, వాటర్ ప్యాకెట్లతో ఒకరిపై ఒకరు విసురుకున్నారు. బారికేడ్లు దూకి కొందరు, రేవంత్ ప్రసంగిస్తుండగానే మరికొందరు జనాలు బయటకు వెళ్లిపోయారు. -నర్సాపూర్

సోమవారం బాన్సువాడ నియోజకవర్గంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళననానికి భారీగా తరలివచ్చిన మైనార్టీలు

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సిరిసిల్ల పట్టణ బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

వస్త్ర పరిశ్రమకు మహర్దశ

- మంత్రి కేటీఆర్ చొరవతో సిరుల ఖిల్లాగా సిరిసిల్ల
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల/సిరిసిల్ల టౌన్, నవంబర్ 20: మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు, పట్టణానికి మహర్దశ వచ్చిందని, నాడు ఉరిసిల్లగా ఉన్న సిరిసిల్ల నేడు సిరుల ఖిల్లాగా వర్ధిల్లుతున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కార్మికులను యజమానులుగా చూడాలన్న లక్ష్యంతో వర్క్ టూ ఓనర్ పథకంలో భాగంగా రెండో బైపాస్ రోడ్డులో అపెరల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే సిరిసిల్లలో లా కళాశాల ఏర్పాటు చేస్తామని వినోద్‌కుమార్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల పట్టణ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బూత్‌స్థాయి సభ్యులు ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాలని, కాంగ్రెస్ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలను తిప్పికొట్టాలని సూచించారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తే సీఎం కావడంతో రైతుల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వ్యవసాయాన్ని పండుగలా చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ చాలంటూ.. వ్యవసాయంపై కనీసం ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. 10 హెచ్‌పీ మోటర్లు వ్యవసాయానికి వినియోగిస్తారా అంటూ ఎద్దేవా చేశారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో సిరిసిల్ల డివిజన్ కేంద్రం జిల్లాగా మారిందని తెలిపారు. ఒకప్పుడు వరంగల్, హైదరాబాద్ వంటి మహానగరాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న ఇంజినీరింగ్, మెడికల్ విద్య.. నేడు సిరిసిల్ల పిల్లలకు చేరువైందని చెప్పారు. అలాగే నర్సింగ్ కళాశాల, వ్యవసాయ, వ్యవసాయ పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల, గంభీరావుపేటలో కేజీ టూ పీజీ విద్యాలయాల సముదాయం ఏర్పాటు కావడంతో సిరిసిల్ల ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందని వివరించారు. తెలంగాణకే తలమానికంగా మంత్రి కేటీఆర్ సిరిసిల్లను తీర్చిదిద్దారని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

తోలు తీస్తా.. తొక్కేస్తా

- హద్దులు దాటుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సరిత మాటలు
- ఇంత అహంకారం పనికి రాదంటున్న గద్వాల ప్రజలు

గద్వాల టౌన్, నవంబర్ 20: 'తోలు తీస్తా.. పాతాళంలోకి తొక్కేస్తా.. నాతో పెట్టుకుంటే ఖబడ్దార్.. వారం రోజుల్లో మూటాముళ్లే సర్దుకొని పోవాల్సిందే' అంటూ కాంగ్రెస్ అభ్యర్థి సరిత, ఆమె భర్త తిరుపతయ్య బీఆర్ఎస్ గద్వాల అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఉద్దేశించి హద్దులు దాటి మాట్లాడుతున్నారు. గొప్ప చదువులు చదివానని, సమాజంపై బాగా అవగాహన ఉందని చెప్పుకొనే సరిత మాట్లాడిన మాటలు.. ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ మాటలు విన్న ప్రతి ఒక్కరి నోట.. 'గ్యాంగ్‌స్టర్ బెదిరింపులు మొదలయ్యాయి.. ప్రశాంతంగా ఉన్న గద్వాలలో కాంగ్రెస్ అభ్యర్థి చిచ్చు పెట్టేందుకు వచ్చినట్టు ఉంది. ఇంత అహంకారం పనికి రాదు. ఇప్పుడే ఇట్లా ఉంటే రేపు అటో.. ఇటో అయితే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి' అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సహజం. కానీ ఓటమి భయంతో కాంగ్రెస్ అభ్యర్థి, నాయకులు.. బీఆర్ఎస్‌పైనే కాకుండా ఎమ్మెల్యే, ఆయన సతీమణి బండ్ల జ్యోతిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. బండ్ల జ్యోతిని ఉద్దేశించి ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి సరిత అన్న మాటలు గద్వాల ప్రజల్లో తీవ్ర భయాందోళనలు రేపుతున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యేను ఆయన కుటుంబాన్ని గద్వాల నుంచి గెంటివేస్తామంటున్న కాంగ్రెస్.. రేపటి రోజు సామాన్య ప్రజలను ఎలా పట్టించుకుంటారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అవకాశమిస్తే ప్రజలు, వారి ఆస్తులకు భద్రత ఉండదన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆమె మాట్లాడి 24 గంటలు కూడా దాటక ముందే.. మద్దకల్ మండలం పెద్దపల్లి బీఆర్ఎస్ నేతపై కాంగ్రెస్ శ్రేణులు దౌర్జన్యం చేస్తూ పిడిగుద్దులు గుద్దిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది.

రేవంత్ ఓ బ్రోకర్.. రవీందర్‌రెడ్డి బట్టేబాజ్

- హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- కాంగ్రెస్ వస్తే నెలకో సీఎం మారుతారు
- స్పీకర్, బాన్సువాడ అభ్యర్థి పోచారం

మాట్లాడుతున్న పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, నవంబర్ 20: పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఓ బ్రోకర్ అని, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఒక బట్టేబాజ్ అని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ విమర్శించారు. సోమవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ మైనార్టీల అభివృద్ధికి చేసిందేమీ లేదని, అదే కేసీఆర్ పదేండ్ల పాలనలో అన్నిరంగాల్లో మైనార్టీలు అభివృద్ధి చెందారని వివరించారు. బీఆర్ఎస్‌తో బీజేపీ కలుస్తుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎనిమిది సీట్లే వస్తాయని, కానీ ఆ పార్టీలో 20 మంది సీఎం సీటును ఆశిస్తున్నారని ఎద్దేవా చేశారు. మైనార్టీల సంక్షేమం కోసం నిత్యం శ్రమించే పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే నెలకో సీఎం మారుతారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీని జనం నమ్మరని, మంచి చేసే వారినే ప్రజలు నమ్ముతారని పేర్కొన్నారు. సీఎం అవుతానని రేవంత్‌రెడ్డి కలలు కంటున్నారని, ఆయన ఎమ్మెల్యేగా కూడా గెలవడని జోస్యం చెప్పారు. తాను తప్పుచేశానని అనిపిస్తే క్షమించండి.. మంచిచేశానని అనిపిస్తే ఓటేసి గెలిపించండని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవనం కూలి ఇద్దరు కార్మికుల దుర్మరణం

మరో ఏడుగురికి తీవ్ర గాయాలు.. దవాఖానకు తరలింపు

మొయినాబాద్, నవంబర్20: నాణ్యతాలోపం.. ఇంజినీరింగ్, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు వలస కార్మికులు దుర్మరణం చెందారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సురంగల్ గ్రామ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని సురంగల్ గ్రామ రెవెన్యూలో ఉన్న ఫైర్ ఫాక్స్ క్లబ్‌లో ఓ భవన నిర్మాణం చేపడుతున్నారు. క్లబ్ యాజమాని ఓ నిర్మాణ సంస్థకు పనులను అప్పగించారు. సుమారుగా 40 ఫీట్ల ఎత్తులో, 200 ఫీట్ల వెడల్పుతో షెడ్డు మాదిరిగా నిర్మాణం చేపట్టారు. ఇనుప స్తంభాల మీద ఇనుప షీట్లు పైకప్పుగా వేశారు. ఆ షీట్ల మీద ఆర్‌సీసీ స్లాబ్ వేశారు. భవన నిర్మాణంలో బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. 14 మంది కార్మికులు సోమవారం పనుల్లో ఉండగా.. నిర్మాణం పైకప్పు పెద్ద శబ్దంతో విరిగి పడింది. బీహార్‌కు చెందిన సునీల్(26), పశ్చిమ బెంగాల్‌కు చెందిన బబుల్(35) శిథిలాల కింద ఇరుక్కుపోయి దుర్మరణం చెందారు. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ టీం సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

యాభై ఏండ్ల దరిద్రం కావాలా?

పదేండ్ల అభివృద్ధి కొనసాగాలా?

- బీజేపీ, కాంగ్రెస్‌కి అండగా ఆంధ్రోళ్లు
- సీఎం కేసీఆర్‌కు అండగా మనం
- బండి సంజయ్ ఓ డ్రామా ఆర్టిస్ట్
- మంత్రి గంగుల కమలాకర్ ఫైర్

కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ నిర్వహించిన ప్రచార ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న గ్రామస్థులు

కరీంనగర్ రూరల్, నవంబర్ 20: యాభై ఏండ్లు పాలించి తెలంగాణ వెనుకబాటుకు కారణమైన దరిద్రమైన కాగ్రెస్ కావాలా? పదేండ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపిన బీఆర్ఎస్ కావాలా? ప్రజలు ఆలోచించాలని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్, ఎలబోతారం గ్రామాలతోపాటు సాయంత్రం నగరంలోని 47, 31, 50, 10 డివిజన్లలో సోమవారం ప్రచారం చేశారు. ఆయా చోట్ల మంత్రి గంగుల మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని ఎంపీగా గెలిపిస్తే నాలుగున్నరేండ్లు పత్తాలేకుండా పోయి.. అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఓట్లు కొనేందుకు వస్తున్నారని దుయ్యబట్టారు. నాలుగున్నరేండ్లుగా ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై మహిళలు నిలదీయాలని చెప్పారు. కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని చెప్పారు.

బీఎస్పీ సభాప్రాంగణం వద్ద అపశ్రుతి

- వేములాడలో షామియానా కూలి 15 మందికి గాయాలు
- దవాఖానకు తరలించిన వలంటీర్లు, పోలీసులు
- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

వేములవాడ, నవంబర్ 20: వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలో బహుజన సమాజ్ పార్టీ సోమవారం నిర్వహించిన ఎన్నికల సభ వద్ద అపశ్రుతి చేటుచేసుకున్నది. సభకు దాదాపు 2,500 మంది తరలివచ్చారు. సభ ప్రారంభమైన కొద్దిసేపటికి అభ్యర్థి గోలిమోహన్ మాట్లాడుతుండగా గాలి అతివేగంగా రావడ